క్లుప్తంగా

ఓరుగల్లు వైద్యులకు జాతీయ అవార్డులు



ఎంజీఎం: ముంబైలో నిర్వహించిన ఆసియా బెస్ట్ హెల్త్ కేర్ జాతీయ అవార్డు కార్యక్రమంలో వరంగల్‌కు చెందిన డాక్టర్ రత్న రమేశ్, జె.ప్రదీప్, సురేశ్‌కుమార్, రామాంజనేయులు అవార్డులు అందుకున్నారు. ఆదివారం నిర్వహించిన ఈ సదస్సులో వివిధ స్పెషాలిటీలో వైద్యులు 250 మందికిపైగా నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. 61 మంది మాత్రమే అవార్డులకు ఎంపికైనట్లు హెల్త్‌వ్యూస్ మ్యాగజైన్ సీఈఓ దీప్తి వర్మ తెలిపారు. ఓరుగల్లు నుంచి నలుగురు వైద్యులు అవార్డులు దక్కించుకోవడంపై పలువురు వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు వాహన వేలం

మల్హర్: మండలంలోని కొయ్యూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నంబర్ 80/2022లో ఉన్న వాహనాన్ని నేడు (మంగళవారం) వేలం వేయనున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు టాటా ఏసీ ట్రాలీ(ఏపీ11వై 3445) వాహనాన్ని బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నియామకం



భూపాలపల్లి రూరల్: శ్రీశైలం శ్రీ మల్లికార్జున దేవస్థానంలో అఖిలభారత వడియ రాజుల(వడ్డెర) సత్రం నూతన కమిటీ డైరెక్టర్‌గా రేగొండ మండలం మడతపల్లి గ్రామానికి చెందిన గుంజ స్వామిని నియమించినట్లు సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు జరపాటి రాములు, చైర్మన్ జరపాటి సత్యనారాయణరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు జరిపాటి రాములు, చైర్మన్ జరిపాటి సత్యనారాయణ రాజులకు, వడ్డెర సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులకు గుంజ స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



కాటారం: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ఎంపీడీఓ బాబు, ఎంఈఓ శ్రీదేవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారిణి చల్ల సునీత, పీఈటీ రాజేశ్వరీ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



రేగొండ: ఉమ్మడి రేగొండ మండలం ఫొటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంబుల రఘు, ప్రధానకార్యదర్శిగా రాజేందర్ నాయక్, ఉపాధ్యక్షులుగా జోరు సుదర్శన్, ఎల్లండి రాకేశ్, కోశాధికారిగా బండి కమలాకర్, సహాయ కార్యదర్శిగా సింగరి కిరణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుక్కా ప్రశాంత్, శ్రీరాముల రాజేందర్, సుమన్, గడ్డే శివాజీ, పాల్గొన్నారు.

పశుగణన సర్వేకు సహకరించాలి



టేకుమట్ల: 21వ అఖిల భారత పశుగణన సర్వేకు పాడి రైతులు సహకరించాలని పశు సంపద సహాయకుడు దాసరి శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని రామకిష్టాపూర్(టి)లో పశుగణన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన పశుగణన సర్వేలో రైతులు పెంచుకుంటున్న అన్ని రకాల పశువుల వివరాలను వెల్లడించాలన్నారు. పశువుల వివరాలతో పాటు ఆధారకార్డు, సెల్ నంబర్‌ను ఇవ్వాలని సూచించారు. దాని ద్వారా పశువులపై ఆధారపడి జీవిస్తున్న పాడి రైతుల వివరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలుస్తుందన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజాపాలన విజయోత్సవ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నట్లు తెలిపారు. తాను ప్రజా సేవకుడినని నియోజకవర్గ ప్రజల కష్టాలు తీర్చేందుకు 18 గంటల పాటు పని చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పలువురికి ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు రంగాపురం, ముల్కలపల్లి, పర్లపల్లి, పెద్దకోమటిపల్లి, కొర్కిశాల, ఆకినపల్లి, మొట్లపల్లి, మెట్టుపల్లి, పిడిసిల్ల, మేదరమెట్ల గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

తరుగు పేరుతో మోసం చేస్తే చర్యలు

కొనుగోలు కేంద్రాలాల్లో తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎక్కువ తూకం వేస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎమ్మెల్యే అడిషనల్ కలెక్టర్, డీఎం సివిల్ సప్లై, డీసీఎస్‌ఓలకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో బస్తాకు 40.650 కేజీలు మాత్రమే తూకం వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కృషి

సాక్షి ఎఫెక్ట్..



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: ప్రయాణికులు సౌలభ్యంగా ప్రయాణించేలా రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిట్యాల, టేకుమట్ల మండలాల ప్రధాన రహదారిలో మూడు లోలెవల్ కల్వర్టులు ప్రమాదకరంగా ఉండడంతో నవంబర్ 9న 'ప్రమాదకరంగా కల్వర్టులు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సత్యనారాయణరావు శాంతినగర్ శివారులో మూడు కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో ప్రయాణికులు లోలెవల్ కల్వర్టుల మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రూ. 2కోట్ల నిధులను మంజూరు చేసి హైలేవల్ కల్వర్టులుగా నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, ఈఈ, వెంకటేశ్వర్లు, ఏఈలు నవీన్‌రెడ్డి, అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, అప్పం కిషన్, దొడ్డి కిష్టయ్య, రాయ కొమురు, వెంకన్న, పులి అంజిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, అనిల్, కుమార్, రవిలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● మోటపోతుల రమేశ్‌గౌడ్



బియ్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రేగొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటపోతుల రమేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపులే పాఠశాల, కేజీబీవీ, లింగాల క్రాస్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనిద, తాగునీటి సమస్య ఉదని, సోలార్ వాటర్ హీటర్ పని చేయక పోవడం వలన చలికాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బెంచీల కొరతతో పాటు, ఉపాధ్యాయుల కొరత వలన విద్యార్థులు నష్టపోతున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ లోపం, స్కూల్ పరిసరాలలో చెత్తను డంపింగ్ చేయడం వలన అనారోగ్య సమస్యల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, శ్రీకాంత్, రామకృష్ణ ఉన్నారు.

ధాన్యాన్ని నేరుగా మిల్లుకు తీసుకురావొద్దు

● డీఎస్‌ఓ శ్రీనాథ్



మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు

చిట్యాల: రైతులు ధాన్యాన్ని నేరుగా మిల్లుకు తీసుకురావొద్దని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని డీఎస్‌ఓ శ్రీనాథ్ అన్నారు. మండలంలోని కైలాపూర్ శివారులోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును సోమవారం జిల్లా సంబంధిత అధికారి డీఎస్‌ఓ శ్రీనాథ్ తనిఖీ చేశారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యంలో మ్యాచర్ ఎక్కువగా ఉండండతో రైస్ మిల్లులో ధాన్యాన్ని అనుమతించలేదు. దీంతో రైతులు గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న డీఎస్‌ఓ శ్రీనాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, తహసీల్దార్ హేమ మిల్లు వద్దకు చేరుకుని పరిస్థితిని గమనించి రైతులతో మాట్లాడారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగొలు సెంటర్‌ల వద్దనే తేమ శాతం తెలుస్తుందని అక్కడే రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు. ఎవరు మిల్లుకు తీసుకపోవద్దని కోరారు. అలాగే కొనుగోలు సెంటర్ ఇన్‌చార్జ్‌లు రైతులు పండించిన ధాన్యాన్ని డైరెక్టుగా మిల్లుకు తరలించవద్దని హెచ్చరించారు. కొనుగోలు సెంటర్ వద్దనే తేమశాతాన్ని చూసి మిల్లుకు తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు వైద్యసిబ్బందికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి నాగరాణి

● వైద్యాధికారిణి నాగరాణి

మొగుళ్లపల్లి: ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలని మండల వైద్యాధికారిణి నాగరాణి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే మండల కేంద్రంలోని బాలల, బాలికల హాస్టళ్లలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత గూర్చి, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవత, డాక్టర్ సంధ్య, హాస్టల్ వార్డెన్స్, సూపర్‌వైజర్ సునీత, శ్రీలత ,స్టాఫ్ నర్స్ సరిత ,కల్పన,, ల్యాబ్ టెక్నీషియన్ సంపూర్ణ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో మహిళ మృతదేహం లభ్యం

కాళేశ్వరం/టేకుమట్ల: కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరి నదిలో విషాదం నెలకొంది. గోదావరి నదిలోకి దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానిక ఎస్సై చక్రపాణి తెలిపిన వివరాం ప్రకారం.. టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సమ్మక్క(55) గత నెల 27న కుటుంబ సభ్యులతో గొడవలు రాగా మనస్థాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించగా ఎక్కడ ఆచూకీ లభించపోడంతో టేకుమట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు కాళేశ్వరం చేరుకోని గోదావరి నదిలో మునిగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం కాళేశ్వరం గోదావరి నదిలో మహిళ మృతదేహం కనిపించడంతో తీరంలో ఉన్న స్థానిక గంగాపుత్రులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలు కుటుంబ సభ్యులు గోదావరికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించగా సమ్మక్కగా ధృవీకరించారు. పోలీసులు జాలరుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయగా మతదేహం కుళ్లిపోయి ఉండడంతో తీరంలోనే డాక్టర్ పోస్టుమార్టం నిర్వహించనున్నారు. భర్త మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాటారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌ను సోమవారం ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఎంపీఓ వీరస్వామి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో గదులు, సౌకర్యాలు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు, స్టేషన్ నంబరింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ఎంత మంది ఓటర్లు ఓటు వేస్తారని, వార్డులకు సంబంధించి ఓటర్లకు ఏ పోలింగ్ బూతులు కేటాయిస్తారని పంచాయతీ కార్యదర్శి షగీర్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్‌లలో పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉంచాలని కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం ఉమారాణి, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న కోటగిరి సతీశ్‌గౌడ్



పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మాదారపు శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ ఆది రఘు, బీఆర్‌ఎస్ మండల నాయకులు బొడ్డు సదానందం, బొల్లు సరోత్తంరెడ్డి ఉన్నారు.

గర్మిళ్లపల్లిలో..

మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన దాసారపు సాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్ సోమవారం పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందించి భరోసా కల్పించారు. అలాగే మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొల్లికొండ రాజయ్య కుమారుడు ఆకాశ్ ప్రథమ వర్ధంతికి హాజరయ్యారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, నాయకులు శాస్త్రాల కిరణ్, ఒరంగంటి శేఖర్, జిల్లా నాయకులు దొంతుల శ్రీనివాస్, సోరుపాక సదానందం, నల్లబెల్లి మొండయ్య, తదితరులు ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



ప్రశంస పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

టేకుమట్ల: మండల కేంద్రంలోని చిన్మయ మిషన్‌లో సోమవారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాలలో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ నేతుల రాజయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మం విలువలను విద్యార్థులు సైతం అలవర్చుకోవాలని, భగవద్గీత ప్రతీ ఒక్కరికి మార్గదర్శి అన్నారు. ప్రతీ ఒక్కరి భవిష్యత్ గీతపై ఆధారపడి ఉంటుందని అన్నారు. అనంతరం జిల్లా స్థాయికి ఎంపికైన వైష్ణవి, శ్రావణి, రుత్వికలకు ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్ నిర్వాహకులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దాతలకు సన్మానం

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విలువ గల సామగ్రిని బహూకరించిన దాతలు పోరిక మోహన్‌లాల్ రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ దంపతులను ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు డుయల్ డెస్కులను, సౌండ్ సిస్టంను అందించారని అన్నారు. పాఠశాలకు బహూకరించిన వారిలో పోరిక జవహర్‌లాల్, పోరిక రవికిరణ్, తులసిరాం, కరణ్‌సింగ్, సమ్మయ్య, వాంకుడోత్ జవహర్‌లాల్ ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయులు రాజు, మురళిధర్, శ్రీనివాస్, రజిత, శివరాం ఉన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

● ఎస్సై అశోక్



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని రౌడీ షీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీ షీటర్ అంటూ ప్రజలను బెదిరింపులకు గురి చేసిన, అక్రమ వసూళ్లకు పాల్పడిన అల్లర్లు, అలజడులకు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చెడు ప్రవర్తన కలిగిన రౌడీ షీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాయకుల, అధికారుల పేర్లు చెప్పి బెదిరిపులకు గాని, డబ్బు వసూళ్లకు పాల్పడితే ప్రజలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

అక్రమ పట్టా రద్దు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న అమ్జద్‌పాషా

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లిలోని 1042 సర్వే నంబర్ భూమిని హట్కర్ కిరణ్ అక్రమంగా పొందిన పట్టాను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్జద్‌పాషా అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్‌జీకి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆ భూమిని 45 సంవత్సరాల క్రితం నిరుపేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించిన భూమిని అక్రమంగా పట్టాపొంది రైతు బంధు పొందుతున్నాడని అన్నారు. అక్రమ పట్టారద్దు చేయాలని మూడు సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని అన్నారు. రైవెన్యూ అధికారులు విచారణ చేపట్టి అక్రమ పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భూక్య పరంసింగ్, లూనావత్ సాంబు నాయక్, జాటోత్ కొమ్ముాలు, హట్కర్ హేమలాల్, భూక్య పద్మ, లక్ష్మి, వీరమ్మ, సమ్మక్క పాల్గొన్నారు.

అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు



టేకుమట్ల: తనిఖీ చేస్తున్న పోలీసులు



చిట్యాల: తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్



మల్హర్: పత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

టేకుమట్ల: గ్రామాల్లో అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. పీపుల్స్‌వార్ గెరిల్లా ఆర్మీ వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు చోట్ల వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ప్రైవేట్ వాహనాలతో పాటు, ఆర్టీసీ బస్సులను సైతం తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే 100 లేదా పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కొనసాగాలంటే నిరంతరం పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సివిల్ టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

వాహనాల తనిఖీ

చిట్యాల: మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామంలో ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. అనుమానిత వ్యక్తులను ద్విచక్రవాహనాలపై తీసుకెళ్లొదని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మల్హర్: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సోమవారం కొయ్యూరు నాగులమ్మ సమీపంలో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మంథని–కాటారం వైపు నుంచి వచ్చే వాహనాలను, లగేజీ బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పందగా ఎవరైన సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు

మంగపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎం, ఏఈఓ పాదెం మేనక ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పట్టణాల నుంచి పల్లెల వరకు మాదక ద్రవ్యాలు సరఫరా అవుతున్నాయని వీటిపై విద్యార్థులు ఆకరిషతులు కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబల్ సత్యనారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రేమపూరితంగా ఉండాలన్నారు. ఏఏపీసీ చైర్మన్ లక్ష్మి, తిమ్మంపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం సత్యనారాయణ, మంగపేట ఎంపీపీఎస్ హెచ్‌ఎం వెంకటస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల కాంతులు



విద్యుత్ కాంతులతో మండల పరిషత్ కార్యాలయం

కాటారం: ప్రజాపాలన ప్రజావిజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ దీపాల అలంకరించారు. కార్యాలయం చుట్టూ విద్యుత్ దీపాలు అలంకరించడంతో నూతన శోభ అలంకరించుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 వరకు మండలంలో ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు తెలిపారు.